క్లుప్తంగా

వైభవంగా శత చండీయాగం


పూర్ణాహుతి సమర్పిస్తున్న పండితులు

సీతంపేట : శ్రీలలితా పీఠంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి ఉత్సవాలు, శత చండీయాగం శనివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. 108 ద్రవ్యములు, వివిధ రకాల పండ్లు, పట్టు చీరలు పూర్ణాహుతిలో సమర్పించారు. వేద పండితుల మంత్రాల మధ్య మహా పూర్ణాహుతి, మహా స్నపనం, దీక్షా విరమణ, వేదాశీర్వాదంతో ఉత్సవాలు ముగించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు లలితా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. సాయంత్రం జమ్మి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు.

46వ వార్డులో అన్నసమారాధన


కస్తూరినగర్‌లో భోజనం వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు కస్తూరినగర్‌లో దుర్గాదేవి మహోత్సవాల్లో భాగంగా దుర్గమాంబ సేవ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధనను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. ముందుగా దుర్గాదేవికి కటుమూరి సతీష్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం అమ్మవారిని ఊరేగించి, నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వేణు, కొండమ్మ, కృప, లక్ష్మి, వరలక్ష్మి, రాజు, ఎంపీ రమణ, కృపారావు, రామ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

బాక్సు కల్వర్టు నిర్మాణం పూర్తి


శ్రీనివాసనగర్‌లో కొత్తగా నిర్మించిన బాక్సు కల్వర్టు

సీతంపేట : జీవీఎంసీ 43వ వార్డు 80 అడుగుల రోడ్ నుంచి శ్రీనివాసనగర్‌లో బెల్లం రాములమ్మ వీధికి వెళ్లే మార్గంలో గెడ్డపై నూతనంగా నిర్మించిన బాక్సు కల్వర్టు పనులు పూర్తి కావడంతో రాకపోకలకు మార్గం సుగమం అయ్యింది. పాత కల్వర్టు ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో అడుగు భాగంలో ఉన్న గోడ బలహీనమై కూలిపోయింది. దీంతో కొత్తగా బాక్సు కల్వర్టు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఎన్నికల అనంతరం జూన్ నెలాఖరులో ప్రారంభమైన పనులు ఇటీవల పూర్తయ్యాయి. గతంలో కంటే విశాలంగా కల్వర్టు నిర్మించి, అప్రోచ్ రోడ్ వేశారు. దీంతో వాహనాలు సులువుగా ప్రయాణించడానికి వీలు కలిగిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జమ్మి చెట్లు పెంచాలి

సీతమ్మధార : ప్రజలంతా విధిగా జమ్మి చెట్లు నాటి పెంచాలని కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి డాక్టర్ సుంకరి రామకృష్ణారావు కోరారు. సీతమ్మధారలోని జీవీఎంసీ పార్కులో జమ్మిచెట్టు నాటిన తర్వాత ఆయన మాట్లాడారు. తులసి, ఉసిరి, మారేడు, వేప, మోదుగ, రావి, జమ్మి వంటి ఆయుర్వేద గుణాలు గల చెట్లను దేవతా వృక్షాలుగా భావించి పూజిస్తామని గుర్తు చేశారు. ఆయుర్వేద మందులలో జమ్మి చెట్టు ఆకులు, పువ్వులు, విత్తనాలు, చెట్టు బెరడు ఉపయోగిస్తారన్నారు. జమ్మి పసరు రాసుకుంటే కుష్టు వ్యాధి కూడా తగ్గుతుందని స్పష్టం చేశారు. అందుకే ఈ చెట్టుకి సురభి బంగారం అని పేరు వచ్చిందని గుర్తు చేశారు.

ఎండైనా.. వానైనా.. ఆరుబయటే

బస్ షెల్టర్లు లేక ప్రయాణికులకు అవస్థలు


సత్యనగర్ వద్ద షెల్టర్ కిందనే ఉన్నప్పటికీ తడిసిపోతున్న ప్రయాణికులు


బిర్లా కూడలిలో ఆరుబయట బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మురళీనగర్ : మురళీనగర్ జాతీయ రహదారిలో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారికి అనుబంధంగా నిర్మించిన సర్వీసు రోడ్డులోనే బస్సు షెల్టర్లున్నాయి. దీంతో ఇవి నిరుపయోగంగా మారాయి. ఎండైనా వానైనా ప్రయాణికులు బస్సుల కోసం ఆరుబయటే వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. మురళీనగర్ నుంచి కంచరపాలెం వరకు జాతీయ రహదారి ప్రయాణికులు, వాహన చోదకులతో నిత్యం రద్దీగా ఉంటుంది. మురళీనగర్, మాధవధార, సత్యానగర్, సూర్యానగర్, సూర్యానగర్ - 2, అయ్యప్పనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, తెన్నేటి నగర్, కళింగనగర్, మురళీనగర్‌లోని 13 సెక్టార్ల ప్రజలు, అల్లూరి సీతారామరాజునగర్, బర్మాకాలనీ, నెహ్రూనగర్, అజయ్‌కలాంనగర్ ప్రాంతాల ప్రయాణికులు నిత్యం జాతీయ రహదారికి రావాల్సి ఉంటుంది. వీరిలో ఉద్యోగులు, కార్మికులు ఎక్కువ మంది బస్సుల కోసం వేచి ఉంటారు. దీంతో బస్సుల కోసం వేచి ఉండే వారితో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. వీరు విశ్రాంతి తీసుకునేందుకు ఎక్కడా షెల్టర్లు లేవు.

ఉన్నవన్నీ నిరుపయోగం

మర్రిపాలెం కూడలి నుంచి తాటిచెట్లపాలెం వరకు ఉన్న షెల్టర్లు సేవా రహదారి వైపు ఉండడంతో అవన్నీ నిరుపయోగంగా మారాయి. అబిద్ హుస్సేన్ నగర్ సేవా రహదారిలో ఒకే చోట రెండు షెల్టర్లు పక్కపక్కనే ఉన్నాయి. ఇవి జంతువులు, నిరాశ్రయులు సేద తీరడానికి తప్ప ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. కొన్నిచోట్ల షెల్టర్లు శిథిలమయ్యాయి. షెల్టర్లు ఒక వైపు ఉంటే బస్సులు వేరే చోట ఆగుతున్నాయి. ఇవి జాతీయ రహదారి డివైడర్ల వద్ద ఆగుతాయి. ప్రయాణికులు కూడా ఎండా వానల్లో డివైడర్ల వద్ద వేచి ఉంటున్నారు. దీంతో వీరికి రక్షణ కరువయ్యింది. బిర్లా కూడలి వద్ద రెండు వైపులా డివైడర్ల వద్దనే ప్రయాణికులు వేచి ఉంటున్నారు. ఇలా ఏళ్ల తరబడి కొనసాగుతున్నా పట్టించుకున్న వారు లేరు.

విద్యార్థులకూ తప్పని అవస్థలు

మురళీనగర్ పరిసరాల్లోని కొన్ని బస్టాపుల వద్ద విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఊర్వశి కూడలిలో పాలిటెక్నిక్ కాలేజీ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఆరుబయట బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. వీరికి కనీస రక్షణ కరువయ్యింది. ఇక ఐదో పట్టణ పోలీసు స్టేషన్ ఎదురుగా సత్యానగర్ వద్ద బస్టాపులున్నా వర్షం కురిస్తే తడిసి ముద్దవ్వాల్సిందే. ఇక్కడ జీబ్రా క్రాసింగ్ వద్ద ప్రైవేటు బస్సులు ఆపుతున్నారు. వీటి వల్ల స్కూల్ విద్యార్థులు, ఇతర ప్రయాణికులు రోడ్డు దాటే సమయంలో బస్సులు అడ్డంగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. జీబ్రా క్రాసింగ్‌ను దాటిన తర్వాత బస్సులు ఆపాలని పలువురు ప్రయాణికులు ఎంత చెప్పినా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.


బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు


ఐదో పట్టణ పోలీసు స్టేషన్ ఎదురుగా జీబ్రా క్రాసింగ్ వద్ద ఆగుతున్న ప్రైవేటు బస్సులు


సర్వీసు రోడ్డులో నిరుపయోగంగా మారిన బస్సు షెల్టర్

బస్సు షెల్టర్లు నిర్మించాలి



బిర్లా కూడలితోపాటు ఇతర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న బస్సు షెల్టర్ల వల్ల కనీస ఉపయోగం లేదు. బస్సుల కోసం ఎండల్లో నిలబడలేక పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విపరీతమైన ఎండలకు సొమ్మసిల్లి పడిపోతున్నారు. ప్రత్యామ్నాయంగా డివైడర్ల వద్ద చిన్నపాటి బస్సు షెల్టర్లు నిర్మించాలి.

– ఎస్.పోతురాజు, ఎన్‌జీజీవోస్ కాలనీ

వాహనాల రద్దీతో ప్రమాదాలు



జాతీయ రహదారిని ఆనుకుని డివైడర్ల వద్ద బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఉదయం పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు 10గంటల వరకు వందలాది మందిగా రోడ్డు మీదనే వేచి ఉంటున్నారు. సిగ్నల్స్ ఇవ్వగానే కొందరు వాహన చోదకులు అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల బస్సుల కోసం వేచి ఉన్న వారు ప్రమాదాలకు గురవుతున్నారు.

– పొటుపురెడ్డి సన్యాసిరావు, మురళీనగర్

సత్ప్రవర్తనతో మెలగకుంటే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శ్రీను

సీతమ్మధార : సమాజంలో అల్లరు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ శ్రీను సూచించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు సీఐ డి.వి.రమణ ఆదేశాల మేరకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలిముద్రలు సేకరించారు. అనంతరం ఎస్ఐ శ్రీను మాట్లాడుతూ ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలు, అల్లర్లు చేసినా, మద్యం సేవించి షాపుల వద్ద గొడవలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు.

ఘనంగా సాయిబాబా సమాధి వేడుకలు


సాయిబాబాకి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం : స్థానిక 104 ఏరియా బాపూజీనగర్‌లో శ్రీషిర్డీ సాయిబాబా సమాధి వేడుకలను ఆలయ ధర్మకర్త ఎడ్ల శ్రీనువాసరావు నేతృత్వంలో ప్రధాన అర్చకులు సూర్య ప్రకాష్ శర్మ ఘనంగా నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి భక్తులు స్వహస్తాలతో క్షీరాభిషేకాలు, విభూది అభిషేకాలు చేశారు. సాయంత్రం సాయిబాబా ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో ఆంజనేయులు, ప్రభాకర్, పైడిరెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే సాయిబాబా మరణం


సాయిబాబా చిత్రపటాలతో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం సాగించిన హింస వల్లనే ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణించారని విశాఖ పౌర ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో ఆదివారం జరిగిన సాయిబాబా సంతాప సభలో పలువరు వక్తలు మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ న్యాయమైన, నూతన సమాజం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని వారు కొనియాడారు. సుదీర్ఘమైన జైలు జీవితం వల్లనే ఆయన ఆరోగ్యం పాడైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన 90 శాతం దివ్యాంగుడు అయినా సరే బెయిల్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో శనివారం సాయిబాబా మరణంతో ప్రజలు నిజమైన పోరాట యోధుడిని కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణానికి కేంద్రమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, ఐప్సు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, బూసి వెంకటరావు, ఎస్.వెంకటలక్ష్మి, ఏడుకొండలు, కేఎస్ చలం, ఎం.పైడిరాజు, జీడీ సారయ్య, రాజు, ఎస్.నాగభూషణరావు, వామనమూర్తి, వి.నల్లయ్య, ఎస్.ఆదినారాయణ తదితరులు మాట్లాడారు.

మాంసాహార దుకాణాలు కిటకిట


సీతమ్మధారలో వినియోగదారులతో రద్దీగా మాంసం దుకాణం

సీతమ్మధార : దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకున్నారు. పండగ శనివారం అయినప్పటికీ అసలు హంగామా అంతా ఆదివారమే కనిపించింది. ఉదయం నుంచే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని మాంసం దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయి కనిపించాయి. సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, బాలయ్య శాస్త్రి లే అవుట్, గురుద్వారా, సక్కవానిపాలెం, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, నార్త్ ఎక్స్‌టెన్సన్ ప్రాంతాల్లో గల చికెన్, మటన్ దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. నాటుకోళ్ల విక్రయాలు కూడా జోరుగా జరిగాయి.

నియోజకవర్గంలో మద్యం జాతర

నియోజకవర్గంలో గల ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద ఆదివారం ఉదయం నుంచే జాతర వాతావరణం నెలకొంది. అన్ని మద్యం దుకాణాలు మందుబాబులతో రద్దీగా కనిపించాయి. పలు ప్రాంతాల్లో బహిరంగంగానే మద్యపానం చేయడం కనిపించింది. నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, బాలయ్య శాస్త్రి లే అవుట్, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లోని మద్యం దుకాణాలు, బార్లు మందుబాబుల రద్దీతో కనిపించాయి.

సంప్రదాయాల పరిరక్షణ ముఖ్యం


డాక్టర్ కేఎస్ శాస్త్రిని సత్కరిస్తున్న చింతలపాటి సత్యదేవ్, తదితరులు

తాటిచెట్లపాలెం : భారతీయ సంస్కృతి పరిరక్షణకు సనాతన సాంప్రదాయాన్ని పాటించడమే ముఖ్యమని జగద్గురుపీఠం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి తెలిపారు. తాటిచెట్లపాలెంలో గల మాస్టర్ హోమియో వైద్యాలయంలో దుర్గాదేవి పూజా మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె.) వద్ద తాము పొందిన ప్రేరణతో వేద సూక్తాలను నేర్పిస్తున్నామన్నారు. జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఉచిత హోమియో వైద్యసేవలను ఒక తపస్సుగా నిర్వహిస్తున్న ఆదర్శనీయులు డాక్టర్ కేఎస్ శాస్త్రి అని కొనియాడారు. అనంతరం డాక్టర్ కేఎస్ శాస్త్రి 120 మంది పేద మహిళలకు చీరలు బహూకరించారు. కార్యక్రమంలో మద్దూరి హనుమంతరావు, సీహెచ్ నరసింహమూర్తి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


ఏఆర్ కార్యాలయంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న అనకాపల్లి ఎస్పీ దీపిక

ఆరిలోవ: శాంతిభద్రతల పరిరక్షణకు దృఢ సంకల్పంతో కృషి చేయాలని పోలీసులకు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక సూచించారు. విజయదశమి సందర్భంగా శనివారం విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు ఆయుధ పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె జిల్లా పోలీస్ అధికారులతో కలిసి దుర్గాదేవికి పూజలు చేశారు. అనంతరం సిబ్బంది వారు ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక మాట్లాడుతూ సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు నిరంతరం కష్టపడుతున్నారన్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పోలీస్ వ్యవస్థలో ఆయుధాలు ఒక భాగన్నామని, వాటిని అందరూ గౌరవించాలని కోరారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, వి.సత్తిరాజు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు బాలసూర్యారావు, సతీష్, మన్మథరావు, నర్సింహమూర్తి, ఎస్ఐలు నాయుడు, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో అన్నదానం

మురళీనగర్ : రామాలయంలో వెలసిన లలితాంబికా దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం నారాయణ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12గంటలకు అన్నదానాన్ని ఆలయ కార్యదర్శి సనపల వరప్రసాద్ ప్రారంభించారు. సుమారు 200 మందికి అన్నదానం చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొని సహకరించారు.

ఐవీఎల్ శాస్త్రి పేరిట తపాలా స్టాంప్ విడుదల


తపాలా స్టాంప్ విడుదల చేస్తున్న జనకులం ప్రతినిధులు

సీతమ్మధార : సంగీత జనకులం వ్యవస్థాపకుడు ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట రూ.5 విలువ గల తపాలా స్టాంపుని కేంద్ర ప్రభుత్వం ముద్రించడం సంతోషకరమని ఆదాయ పన్ను శాఖ అధికారి వి.నాగ సూర్యారావు అన్నారు. విజయదశమి సందర్భంగా సీతమ్మధారలో శనివారం నిర్వహించిన సంగీతసభలో ఆయన మాట్లాడుతూ ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత ప్రపంచానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కులపతి బుక్ ట్రస్ట్ కార్యదర్శి చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ 20 వేల మందికి శాస్త్రీయ సంగీతంలో ఉచిత శిక్షణ ఇచ్చారని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి చూపిన మార్గంలో సంగీత జనకులం సంస్థ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం వారు స్టాంపు విడుదల చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.విజయప్రసాద్, సీహెచ్.గిరిధర్, సంగీత గురువులు ఐ.రమణిప్రసాద్, ఎస్.లక్ష్మి, శైలేష్ పాల్గొన్నారు.

ముగిసిన సంబరాలు


కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

మీంం పాలెం: శిల్పారామంలో కొద్ది రోజులుగా జరుగుతున్న దసరా సంబరాలు శనివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన నృత్యభారతి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా శాస్త్రీయ నృత్యం ప్రదర్శించి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

ముగిసిన ధ్యాన మందిరం వార్షికోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో బాబా విగ్రహం


ధ్యాన మందిరంలో భక్తులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 3న గురువారం నుంచి ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవాలు దసరా రోజున ముగిశాయి. రోజూ ప్రత్యేక కార్యక్రమాలు, కుంజర మహా గణపతి అభిషేకం, బాబాకి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, సహస్రనామార్చన, భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, అనంతరం వస్త్రాలంకరణ, పల్లకీ సేవ, హోమం వంటివి నిర్వహించారు. దసరా రోజున బాబా 106వ మహా సమాధి (పుణ్యతిథి) సందర్భంగా దీపారాధన, భక్తుల స్వహస్తాలతో విభూది అభిషేకం, మహా అన్నదానం నిర్వహించారు. కాశీ, హరిద్వార నుంచి తెచ్చిన పంచముఖి రుద్రాక్షలతో స్వామిని అభిషేకించారు. అనంతరం రుద్రాక్షలు, కంకణాలు, బాబా ఫొటో, షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూది భక్తులకు అందజేశారు.

ఎక్కడి చెత్త అక్కడే


ఎన్ఆర్ఐ ఆస్పత్రి సమీపంలో డంపర్‌బిన్ నిండిపోవడంతో రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు


వివేకానంద కల్యాణమండపం సమీపంలో చెత్తతో నిండిపోయిన డంబపర్‌బిన్

- డంపర్ బిన్లు నిండినా తరలించని జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది

సీతమ్మధార : జీవీఎంసీ 14, 24వ వార్డుల్లోని పలు ప్రాంతాలు చెత్తమయంగా తయారయ్యాయి. ఏ వీధిలో చూసినా చెత్తకుప్పల నుంచి దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతమ్మధార రైతుబజార్ చెంతనే చెత్తకుప్పలు పేరుకుపోతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని... రైతుబజార్ లోపల కూడా పారిశుధ్యం అంతంతమాత్రంగానే ఉంటోందని రైతులు వాపోతున్నారు. 24వ వార్డు నక్కవానిపాలెం వివేకానంద కల్యాణమండపం ఆవరణతోపాటు 14వ వార్డు ఎన్ఆర్ఐ ఆస్పత్రి సమీపంలోని ప్రాంతాల్లో రోడ్ల పక్కనే చెత్త పేరుకుపోతున్నా పారిశుధ్య సిబ్బంది సకాలంలో తరలించడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డంపర్‌బిన్లు కూడా చెత్తతో నిండిపోయినప్పటికీ తరలించకపోవడంతో వాటి పక్కనే చెత్త వేయాల్సి వస్తోందని స్థానిక నివాసులు వాపోతున్నారు. చెత్త వద్ద ఆవులు, కుక్కలు, పందులు చేరి ఇష్టానుసారంగా చెల్లాచెదురు చేస్తున్నాయని, ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించి ఈ వార్డుల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ సంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యా ణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యా ణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రానికే ముప్పు


దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘు నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రం భారీగా నష్టపోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1340వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి ఆయువు పట్టువంటి విశాఖ ఉక్కును అమ్మేస్తే రాష్ట్రానికి వెన్నెముక విరిగినట్టే అన్నారు. దసరా పండగకు బోనస్ చెల్లించాల్సిన యాజమాన్యం కనీసం జీతాలు కూడా చెల్లించకుండా మానసికంగా వేధిస్తుందన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో బోనస్ చెల్లిస్తే, ఇక్కడ మాత్రం జీతం కూడా చెల్లించకుండా కావాలనే కార్మికులను, వారి కుటుంబ సభ్యులను వేధిస్తుందని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకలు కామేశ్వరరావు, డేవిడ్, విళ్లా రామ్మోహన్‌కుమార్, బాల భాస్కరరావు పాల్గొన్నారు.